సాక్షి ప్రకాశం

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయనకు జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులర్పించారు. విగ్రహాలకు పూలమాలలు వేశారు.

- IIలో..



విజయపతాకం ఎగరేయాలి

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి విజయపతాకం ఎగరేయాలని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
37.6/27.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

శనివారం - ఇఫ్తార్ : సా॥ 6.28

ఆదివారం - సహరీ : ఉ॥ 4.39



టీడీపీ అధినేత జిత్తుల మారి నారా ఎత్తులతో జిల్లాలోనే జనసేన కుర్చీ మడతెట్టేశాడు. నాలుగేళ్లుగా దర్శిలో కష్టపడిన స్థానిక టీడీపీ, సేనలకు చంద్రబాబు మొండిచేయి చూపారు. ఇక్కడ అభ్యర్థి విషయంపై చివరి వరకూ ఇటు టీడీపీ.. అటు జనసేనలను ఊరించారు. ఆశావహులను ఉసూరుమనిపించారు. చివరకు ఈ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేని జిల్లా ఎల్లలు దాటి తన సొంత సామాజిక వర్గానికి చెందిన మహిళకు టికెట్ ఇచ్చి స్థానిక నేతలకు బాబు మార్క్ షాక్ ఇచ్చారు.

- పథకం ప్రకారం దర్శిలో జనసేనకు మొండిచేయి
- టికెట్‌పై ఆశతో ఐదేళ్లు కష్టపడిన టీడీపీ, జనసేన నేతలు
- ప్లాన్ ప్రకారం జనసేనలోకి గరికపాటి
- చివరకు కాపులకు మొండిచేయి
- సొంత సామాజికవర్గానికి జైకొట్టిన బాబు
- ఆగ్రహంతో రగిలిపోతున్న సేనలు



జనసేన కుర్చీ మడతెట్టేశాడు..!

దర్శి: దర్శి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు నాలుగేళ్లుగా జనసేన పార్టీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో గిద్దలూరు తర్వాత జనసేనలు ఆశించింది దర్శి స్థానాన్నే. 2019లో ఇక్కడ నుంచి జనసేన పార్టీ తరఫున పోటీ చేశారు కాపు సామాజిక వర్గానికి చెందిన బొటుకు రమేష్. ఈ ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకునే ఉన్నారు. ఇదే సామాజికవర్గానికి చెందిన వరికూటి నాగరాజు కూడా 2024లో ఇక్కడ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. ఒక వేళ పొత్తులో భాగంగా జనసేనకు ఇక్కడ నుంచి టికెట్ ఇవ్వాల్సి వస్తుందేమోనని టీడీపీ అధినేత చంద్రబాబు తన మార్క్ కుట్ర రాజకీయానికి తెరతీశారు. అప్పటి వరకూ గ్లాసు పార్టీని నమ్ముకున్న కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి పోటీగా తన సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని జనసేనలోకి పంపేందుకు పథకాన్ని రచించారు. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగంలో ఉన్న నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న గరికపాటి వెంకట్‌ను జనసేన పార్టీలోకి పంపారు. పక్కా ప్లాన్ ప్రకారం గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన వెంకట్ నియోజకవర్గంలోకి అడుగు పెట్టాడు. భారీగా జనసేన, టీడీపీల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జనసేన టికెట్ నాదేనంటూ స్పీడ్ పెంచి హంగామా చేశారు. ఈ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన ఎడ్ల పందేలు, ముగ్గుల పోటీలు వంటి పలు కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు.

నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనించిన టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్న పమిడి రమేష్ పార్టీ నుంచి తప్పుకున్నారు. ఇక వెంకట్ అన్నీ తానై వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కూటమిలో సమీకరణాలు మారిపోతూ వచ్చాయి.

గాల్లో కృష్ణ చైతన్య..

అద్దంకిలో ఉన్న బాచిన చెంచు గరటయ్య, ఆయన కుమారుడు కృష్ణ చైతన్యలను పార్టీలోకి తీసుకుని అవసరమైతే జనసేన నుంచి పోటీ చేయాలని బాబు కండీషన్లు పెట్టారు. ఇదే సమయంలో చంద్రబాబు ఈయన కంటే ధనవంతుడికి గాలం వేశారు. రహస్యంగా ఆయనతో చర్చలు జరుపుతూనే మరో పక్క కృష్ణ చైతన్యకు మొండిచేయి చూపారు. చివరకు చీరాల టికెట్ అయినా కేటాయించాలని గరటయ్య చంద్రబాబును కోరారు. అక్కడా వారిని చివరి వరకూ ఊరించి ఉసూరుమనిపించారు. బాబు రాజకీయ కుట్రలకు ప్రస్తుతం తండ్రీ, కొడుకుల పరిస్థితి అగమ్యంగా మారింది. ఇక కమ్మసామాజిక వర్గానికి చెందిన గోరంట్ల రవికుమార్‌ను ఇన్‌చార్జిగా రంగంలోకి దింపారు. ఆయన్ను స్థానిక కాపు, కమ్మ సామాజిక వర్గాలకు చెందిన నేతలు పూర్తిగా వ్యతిరేకించారు. జనసేన కానీ, టీడీపీ అయినా స్థానికులకే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఎల్లో మీడియా ద్వారా రోజుకో పేరును తెరపైకి తెచ్చి స్థానిక నేతలను గందరగోళానికి గురిచేశారు. ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో కొత్త పేర్లను ప్రచారంలోకి తెచ్చారు. నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు స్థానిక కేడర్‌ను సైతం పట్టించుకోకుండా పొరుగు జిల్లాకు చెందిన గొట్టిపాటి లక్ష్మికి టికెట్ ఇచ్చి అందరికీ షాక్ ఇచ్చారు. వాస్తవానికి నరసరావుపేట నియోజకవర్గంలో డాక్టర్‌గా ప్రైవేట్ క్లీనిక్ నిర్వహిస్తున్న ఆమె అక్కడే టికెట్ ఆశించారు. అయితే ఆమెకు అనూహ్యంగా దర్శి టికెట్ ఇచ్చారు. ఈ నిర్ణయంపై రెండు పార్టీల నేతలు విస్మయానికి గురయ్యారు. అక్కడ పనికిరాని చెత్త ఇక్కడ ఎలా పనికొస్తుందంటూ బాహాటంగానే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. టికెట్ ఆశలతో స్థాయిని బట్టి రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చుచేసుకున్న జనసేన నేతలు టీడీపీ అధినేత చంద్రబాబుపై గుర్రుగా ఉన్నారు. తాము ఎట్టి పరిస్థితుల్లో సహకరించేది లేదంటూ ఆ పార్టీ కార్యకర్తలు సైతం హెచ్చరిస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన గరికపాటి వెంకట్‌ను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థి లక్ష్మి బంధువులు రంగంలోకి దిగినట్టు తెలిసింది. అతనితో చర్చలు జరుపుతున్న విషయం స్థానిక కేడర్‌కు తెలిసింది. నీతో పాటు మేము కూడా పార్టీలో కష్టపడ్డాం. రూ.లక్షలు ఖర్చుచేశాం..మరి మా పరిస్థితి ఏంటని నిలదీసినట్టు స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మొత్తంగా చంద్రబాబు ఎత్తులకు జనసేనలు చిత్తయ్యారు.

టీడీపీ, జనసేనకు షాక్



వైఎస్సార్ సీపీలో చేరిన అపార్ట్‌మెంట్‌ల వాచ్‌మెన్ల (రజకులు) కుటుంబాలకు పార్టీ కండువా వేసి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

- బాలినేని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన రజకులు

ఒంగోలు:

నగరంలో టీడీపీ, జనసేనకు రజక సోదరులు భారీ షాక్ ఇచ్చారు. శుక్రవారం రజక సంఘ పెద్దలు, ప్రజలు భారీగా బాలినేని నివాసానికి చేరుకుని పార్టీలోకి చేరాలనుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ అపార్టుమెంట్లలో వాచ్‌మన్‌లుగా జీవనం సాగిస్తున్న 70 రజక కుటుంబాలకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒగ్గలకుంటలో 3.74 ఎకరాల భూమికి సంబంధించి 1999 నుంచి వివాదం కొనసాగుతోందని, ఆ భూమి రజకులకు దక్కేలా సహకరించానన్నారు. మీకు ఏ అవసరం వచ్చినా తప్పకుండా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టీడీపీ అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకుందని, చివరకు వృద్ధుల పెన్షన్లపై కూడా రాజకీయం ప్రారంభించారన్నారు. దీనివల్ల వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వాటన్నింటికీ కారణమైన టీడీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఏపీ ఎన్‌జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలోని అపార్టుమెంట్లలో వాచ్‌మన్‌లుగా ఎక్కువగా రజక సోదరులే ఉంటున్నారన్నారు. పార్టీ మీద ఉన్న అభిమానం, జగనన్న పంపిణీ చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా దాదాపు 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరి పార్టీ కండువాలు కప్పుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. 18 సంవత్సరాలుగా బాలినేని సహకారం ఉండబట్టే ఒగ్గలగుంటను నేడు దక్కించుకోవడం సాధ్యపడిందన్నారు. ఇళ్ల స్థలాలకు రూ.230 కోట్లు తెప్పించేందుకు బాలినేని చేసిన పోరాటం మన అందరికీ ఆదర్శం అని, ప్రస్తుత ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆయన్ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

రజక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం సుబ్బన్న, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి తదితరులు మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఒగ్గులకుంట విషయంలో గత ప్రభుత్వం రజక పెద్దలను జైలుకు కూడా పంపిందని, దామచర్ల జనార్దన్ నైజాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. అన్ని కులాలకు ఆరామ క్షేత్రాలను ఏర్పాటు చేయడంతోపాటు ఘాటుకు రూ.50 లక్షల నిధులు కూడా అందించడం వల్లే నేడు ఘాటు నిర్మాణం కూడా పూర్తిచేసుకోగలిగామన్నారు. ఇంతటి సహకారం అందిస్తున్న బాలినేనికి అండగా ఉండి అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ మార్లెళ్ల శ్రీదేవి, రజక సంఘ పెద్దలు గుర్రం సుబ్బన్న, స్వర్ణ మల్లిఖార్జునరావు, బొప్పరాజు జ్యోతి, ఆంజనేయులు, పాదర్తి వెంకటేశ్వర్లు, మార్టూరు వెంకటేశ్వర్లు తదితరుల ఆధ్వర్యంలో 70 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు.

న్యూస్‌రీల్

'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో స్వల్ప మార్పులు

- సీఎం జగన్ బస చేసే ప్రాంగణం మార్పు
- 6న జువ్విగుంట క్రాస్ వద్ద బస చేయనున్న సీఎం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సురేష్

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శనివారం రాత్రికి జిల్లాలో ప్రవేశించనుంది. అయితే మొదట సీఎం బస చేసే ప్రాంగణాన్ని పొన్నలూరు మండలం ముత్తరాసుపాలెం సమీపంలో ఏర్పాటు చేయగా, షెడ్యూల్ మార్పులో భాగంగా జువ్విగుంట క్రాస్ రోడ్డు వద్ద బస చేసే ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. 6న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో సాయంత్రం 3 గంటలకు 'మేమంతా సిద్ధం' సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారు. అనంతరం ఉలవపాడు క్రాస్, సింగరాయకొండ క్రాస్, ఓగూరు, కందుకూరు, పొన్నలూరు, వెంకుపాలెం మీదగా జువ్విగుంట క్రాస్ రోడ్డు వద్దకు చేరుకొని రాత్రి అక్కడ బస చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి ఆదిమూలపు సురేష్ వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మరుసటి రోజు 7న ఆదివారం ఉదయం కే అగ్రహారం, అలవలపాడు, కనిగిరి మీదుగా సాయంత్రం 4 గంటలకు పొదిలి సమీపంలో జరిగే బహిరంగ సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..

- మీలో ఒకడిగా ఉంటా మీకు సేవ చేస్తా
- చంద్రబాబు శిష్యుల మాయమాటలు నమ్మొద్దు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- నాయకుడిలా కాదు సేవకుడిలా పనిచేస్తా: దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: ''కార్యకర్తల కష్టం, శ్రమ, విలువ తెలిసిన వ్యక్తిని ..సమయాభావం వల్ల కొందర్ని కలవకపోవచ్చు... పార్టీలో జెండా మోసిన ప్రతి కార్యకర్తకు అండగా.. మీలో ఒకడిగా సేవచేస్తా.. మమ్మల్ని మనస్ఫూర్తిగా ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని'' వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. పట్టణంలోని వెన్నెల అపార్ట్‌మెంట్ ముందున్న గ్రౌండ్‌లో పార్లమెంటరీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే టీజే సుధాకర్ బాబు అధ్యక్షతన శుక్రవారం రాత్రి కనిగిరి పట్టణ, రూరల్ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండా మోసిన ప్రతి కార్యకర్తను అక్కున చేర్చుకుంటానన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఆదరించాలని అభివృద్ధి అంటే ఏమిటో, ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో సుమారు రూ.వెయ్యి కోట్లతో 5 వేల అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. నాకు ఎటువంటి వ్యసనాలు, వ్యాపకాలు, వ్యాపారాలు, పరిశ్రమలు ఏమీలేవని.. పొదిలిలో నివాసం ఏర్పాటు చేసుకుని మీలో ఒకడిగా సేవ చేస్తానని తెలిపారు.

చంద్రబాబు శిష్యుల మాయ మాటలు నమ్మవద్దు..

కనిగిరి నియోజకవర్గంలో చంద్రబాబు శిష్యులు కొందరు జిమ్మిక్కు ప్రచారాలు చేస్తున్నారని, వారి మాయ మాటలు నమ్మొద్దు అని చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. ఒక్కసారికి తనకు ఓటేసి గెలిపించండి గెలిచిన తర్వాత తాను వైఎస్సార్ సీపీలోకి వస్తానని ప్రచారం చేస్తున్నారని.. అటువంటి వారిని నమ్మొద్దన్నారు. ఒక్కసారి జగనన్నకు వ్యతిరేకంగా చంద్రబాబుతో కలిసి పనిచేసిన వ్యక్తులను పార్టీలోకి కాదు కదా.. ఇంటి గేటు దగ్గరికి కూడా రానివ్వరని తెలిపారు. జగనన్న సైనికుడు, మన శాసన సభ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ఒక్కడేనని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తానని, ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యన్నారాయణరెడ్డి నియోజకవర్గ పునర్విభజనలో ఎమ్మెల్యే సీటుకు అవకాశం కల్పిస్తానని సీఎం జగన్ చెప్పారని అన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వేదికపై దద్దాల నారాయణ యాదవ్, టీజేఆర్ సుధాకర్‌బాబు, కదిరి బాబూరావు, వైఎం ప్రసాదరెడ్డి, చింతల చెరువు సత్యనారాయణ, గఫార్

పార్టీ నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సామాజిక సాధికారత జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు రెండు జిల్లాల్లో బీసీలకు కనీసం ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. బీసీలకు ఒక్కసీటు ఇవ్వని చంద్రబాబును నమ్మొద్దన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్యే, పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కరరెడ్డి సేవకుడిగా పనిచేసేందుకు ఎంపీగా వచ్చారని, గత ఎంపీ కేవలం వ్యాపారాల కోసమే రాజకీయంలో ఉన్నారని విమర్శించారు. ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధిని సీఎం వైఎస్ జగన్ అందించారన్నారు. పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఎంపీగా రావడం మనకు వరం లాంటిదన్నారు. గతంలో ఎంపీగా ఉన్న వ్యక్తి కాఫీలు తాగారా..టిఫిన్‌లు చేశారని అని పలరింపులు తప్ప ఎక్కడా అభివృద్ధి చేసిన పాపాన పోలేదని విమర్శించారు. సీటు ఇవ్వకపోతే పార్టీలు మారే వ్యక్తి మాగుంట అని విమర్శించారు.

బతికున్నంత వరకూ చంద్రబాబును నమ్మను.. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

''చంద్రబాబు అంత నమ్మక ద్రోహి ఎవరూ లేరు. నాకు రాజకీయాలు లేకపోయినా పర్వాలేదు. నేను బతికి ఉన్నన్ని రోజులూ చంద్రబాబును నమ్మనని'' మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. జనసేన పార్టీ వల్ల కాపులకు నష్టం జరిగిందేకానీ ఎక్కడా లాభం జరగలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే కాపులకు సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. గతంలో ఎంపీగా పనిచేసిన వ్యక్తి దొర్లుడు పుచ్చకాయ అని.. అతని వ్యాపారాల కోసం ఎక్కడికైనా వెళ్తారని అని ప్రజా సేవ చేయాలనే ఆలోచన లేదన్నారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఎంతో సేవా దృక్పథం ఉన్న వారని, కార్యకర్త స్థాయి నుంచి వచ్చిన వ్యక్తి అని తెలిపారు.

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు, ఎంపీపీ ప్రకాశం, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, డాక్టర్ పెరుగ మురళీ, కృష్ణా, శ్రీరాంసతీష్ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేసి దద్దాల నారాయణను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దద్దాల మంజు భార్గవి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితారెడ్డి, వైస్ చైర్మన్‌లు పులిశాంతి, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం పార్టీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, దద్దాల నారాయణను, పార్టీ నేతలను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుమారు పట్టణంలోని సుమారు 50 కుటుంబాలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దద్దాల నారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



సభకు హాజరైన ప్రజలు

క్లుప్తంగా

వాచ్‌మనా? టీడీపీ కార్యకర్తా?



టీడీపీ కండువా వేసుకున్న విద్యుత్ కార్యాలయ వాచ్‌మెన్ రాజేష్(వృత్తంలో వ్యక్తి)

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న నల్లబోతుల రాజేష్(కన్నా) ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడు. శుక్రవారం పామూరులోని అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతులమీదుగా రాజేష్ టీడీపీ కండువా వేయించుకున్నారు. ఈ చిత్రం చూసిన వారంతా రాజేష్ వాచ్‌మనా లేదంటే టీడీపీ కార్యకర్తా అని చర్చించుకుంటున్నారు. ఎన్నికల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.4 లక్షలు ఆస్తి నష్టం


మద్దిపూడి: క్యూరింగ్‌లో ఉన్న పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన మండలంలోని వేమవరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన కొమ్మినేని సుబ్బయ్య, కందిమళ్ల వెంకటేశ్వర్లుకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కర్ర జారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు ఎగసిపడ్డాయి. బ్యారన్‌లోని 1300 కర్ర, టైర్లు, గొట్టాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. కనిగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

ప్రేరణ ఉత్సవాలు వాయిదా

ఒంగోలు సెంట్రల్: జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు శనివారం జరగాల్సి ఉండగా వాయిదా పడినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు తిరిగి ఏప్రిల్ 19న ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో స్కూల్ స్థాయి పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి స్కూల్ నుంచి ఇద్దరు విజేతలను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏప్రిల్ 12లోపు అందజేయాలని కోరారు. అదే విధంగా ప్రేరణ పోర్టల్‌లో 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల పేర్లు నమోదు చేయకపోతే తక్షణమే నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

ఏపీజీబీ మేనేజర్‌ను తొలగించాల్సిందే..

- ఆర్‌ఎం వద్ద పట్టుబట్టిన రైతులు



బ్యాంక్ ఆర్‌ఎంతో మాట్లాడుతున్న ఖాతాదారులు

మద్దిపూడి: మండల కేంద్రమైన మద్దిపూడి పడమటి బజారులోని ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ పెండ్యాల అనీల్‌కుమార్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీజీబీ మార్కాపురం డివిజన్ ఆర్‌ఎం శ్రీనివాస ప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఖాతాదారులతో బ్యాంక్ మేనేజర్ వ్యవహార శైలి సరిగా లేదని వివరించారు. బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు అవసరానికి ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. మహిళా ఖాతాదారులతో మేనేజర్ వ్యవహరిస్తున్న తీరును రైతులు తీవ్రంగా ఆక్షేపించారు. బ్యాంక్ వద్ద పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు రంగంలోకి దిగారు. విచారణ అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ.. రైతులతో సక్రమంగా నడుచుకోవాలని మేనేజర్‌కు సూచించారు. తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



టంగుటూరులో నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, పలు సంఘాల నాయకులు

టంగుటూరు/చీమకుర్తి రూరల్(చీమకుర్తి)/ఒంగోలు: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. టంగుటూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అంజలి ఘటించారు. ఇక్కడి బొమ్మల సెంటర్లో జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైస్ ఎంపీపీ దగ్గుమాటి సుమన్‌రెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు మల్లవరపు జయరామిరెడ్డి, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు పాల్గొన్నారు.

✦ చీమకుర్తి పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరుగు నాగార్జున ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, చీమకుర్తి పట్టణ సొసైటీ అధ్యక్షుడు గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపవరపు రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, కముజుల ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో..

ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఆ పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు పసుమర్తి గోపీచంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎల్‌సీ పోతుల సునీత, వైఎస్సార్‌సీపీ యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జగ్జీవన్‌రాం చిత్రపటం, వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కుసుకుర్తి ఆదెన్న, పార్టీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలా కుమారి, సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి, రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, గంటా రామానాయుడు, పల్లా అనూరాధ, మేరీకుమారి, శివకుమార్, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీ ఘన నివాళి

ఒంగోలు సెంట్రల్/ఒంగోలు సబర్బన్: స్థానిక నెల్లూరు బస్టాండ్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ నివాళులర్పించారు. జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు, పలు సంఘాల నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

✦ జిల్లా పోలీస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సంస్కర్తగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్‌వీ శ్రీధరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, కనిగిరి డీఎస్పీ రామరాజు, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఏఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్‌తోపాటు సీఐలు, ఎస్పీ పరిపాలనా కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భళిరా.. భళిభళిరా.. పులివెందుల పులిరా..



ఒంగోలు చర్చి సెంటర్‌లో స్టెప్పులేస్తున్న యువత



తిలకిస్తున్న మేయర్ గంగాడ సుజాత, బాలినేని శ్రీకావ్య వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేపట్టిన అభివృద్ధిని తెలియజేస్తూ వైజాగ్ స్ట్రీట్ డ్యాన్సర్స్ ఫ్లాష్‌మాబ్‌తో దుమ్మురేపారు. ఒంగోలు నగరంలోని చర్చిసెంటర్, కొత్తపట్నం బస్టాండ్, గోరంట్ల మల్టీప్లెక్స్, అద్దంకి బస్టాండ్, మంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద డ్యాన్సర్ల బృందం చేసిన నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ తదితరులు మాట్లాడుతూ.. జగనన్న సంక్షేమ పాలన, ప్రజలకు కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించేందుకు యువత చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కొత్తపట్నం బస్టాండులో పలువురు మహిళలు, గోరంట్ల కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు సైతం హుషారుగా స్టెప్పులేసి అభిమానం చాటుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, గంటా రామానాయుడు, సాహిత్య అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, పల్లా అనూరాధ, సాధం విజయలక్ష్మి, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయపతాకం ఎగురవేయాలి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సమష్టిగా కృషి చేసి కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయపతాకం ఎగురవేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం పర్యటించి, ముఖ్య నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవ్వ తాతలకు ప్రతీ నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున ఇంటి తలుపు తట్టే మొదటి వ్యక్తిగా గుర్తుకొచ్చేది వలంటీరని, వారిని ప్రజా సేవల నుంచి దూరం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. రెండు నెలలు ఓపిక పడితే మీ అందరి మద్దతుతో జగనన్న మళ్లీ అధికారంలో వచ్చి మీ ఇంటి వద్దకే పింఛను అందించే ఏర్పాట్లు చేస్తారని భరోసా ఇచ్చారు. పేదల ఉసురు తగిలి రానున్న ఎన్నికల్లో టీడీపీ, పొత్తు పార్టీలకు ఓటమి తప్పదన్నారు. అనంతరం మేకం శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఒంగోలు మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ వల్లంరెడ్డి రమణారెడ్డి, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, ఎంపీటీసీ మేకం చిన్నమ్మాయి, మాజీ సర్పంచి వల్లంరెడ్డి బసవరెడ్డి, పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



ఎం.నిడమానూరులో మేకం శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

చంద్రబాబూ.. నోరు అదుపులో పెట్టుకో..

- కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతారనడం మతి లేని మాటలు
- బేషరతుగా వ్యాపారులకు క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బాలసుబ్బారావు



మార్కాపురం: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు మతి తప్పిందని, సమాజంలోని వివిధ వర్గాలపై ఆయన తరచూ నోరు పారేసుకోవడమే అందుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు తడికమల్ల బాలసుబ్బారావు ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కోనసీమ జిల్లా రావులపాలెం సభలో వర్తక వ్యాపారులను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కిరాణా దుకాణాల్లో గంజాయి అమ్ముతారనడం వైశ్య, ఇతర వర్గాల వ్యాపారులను కించపరచడమేనన్నారు. గౌరవంగా వ్యాపారం చేసుకుంటూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమను గంజాయి అమ్మకందారులతో పోలుస్తూ చులకనగా మాట్లాడటం తగదని హితవుపలికారు. కిరాణా వర్తకులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకుని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యకు చెక్!

- 8 మండలాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- ప్రణాళిక సిద్ధం చేసి పంపిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- నేడో రేపో ప్రభుత్వం నుంచి అనుమతి

మార్కాపురం: మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్లతో నీరు సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. అనుమతికి సంబంధించిన ఉత్తర్వులు నేడో రేపో రానున్నాయి. మార్కాపురం, తర్లుపాడు, పెద్దదోర్నాల, పెద్దారవీడు, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోని 84 హ్యాబిటేషన్లలో రోజూ 658 ట్యాంకర్ల నీటిని ప్రజలకు సరఫరా చేయనున్నారు. ఇందులో భాగంగా మార్కాపురం మండలంలోని గజ్జలకొండ, గొగులదిన్నె, ఇడుపూరు, జమ్మనపల్లి, కోలభీమునిపాడు, నాయుడుపల్లి, పెద్దనాగులవరం పెద్దయాచవరం, పడమటిపల్లి, రాయవరం, తిప్పాయపాలెం, తూర్పుపల్లి, వేములకోట, నికరంపల్లి, తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు, కేతగుడిపి, నాగేళ్లముడుపు, పోతలపాడు, రాగసముద్రం, సీతానాగులవరం, తర్లుపాడు, తాడివారిపల్లి, గానుగపెంట, దోర్నాల మండలంలోని బోడేనాయక్‌తాండ, దోర్నాల, పెద్దబొమ్మలాపురం, రామచంద్రకోట, పెద్దారవీడు మండలంలోని బి.చెర్లోపల్లి, చట్లమిట్ల, దేవరాజుగట్టు, రామాయపాలెం, రేగుమానిపల్లి, సానికవరం, పుల్లలచెరువు మండలంలోని మల్లపాలెం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల పంచాయతీల్లో, కొనకనమిట్ల మండలంలోని చినమనగుండం, చింతగుంట, గనివానిపల్లి, గొట్లగట్టు, కేకేమిట్ల, మునగపాడు, నాగిరెడ్డిపల్లి, రేగుమానిపల్లి, వద్దిమడుగు, వాగుమడుగు, వెలిగండ్ల, పొదిలి మండలంలోని ఆముదాలపల్లి, అన్నవరం, జువ్వలేరు, కొండాయపాలెం, కుంచేపల్లి, మల్లవరం, మూగిచింతల, ఓబులక్కపల్లి, సూదనగుంట, తుమ్మగుంట పంచాయతీల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయనున్నారు.

పోల్, ఈవీఎం మేనేజ్‌మెంట్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

- పీఓ, ఏపీఓల శిక్షణలో కలెక్టర్ దినేష్‌కుమార్



ఈవీఎంలపై పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పోల్ మేనేజ్‌మెంట్, ఈవీఎం మేనేజ్‌మెంట్‌పై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్, ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. ఒంగోలు నియోజకవర్గంలోని పీఓలు, ఏపీఓలకు శుక్రవారం కేంద్రియ విద్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 423 మందికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీఓలు, ఏపీఓలకు రెండు విడతల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో ఈ నెల 5, 7వ తేదీల్లో, రెండో విడత 12, 13వ తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి, ఈవీఎంలను ఏ విధంగా అనుసంధానం చేయాలి, ఈవీఎంల్లో ఏదైనా సాంకేతిక సమస్య ఎదురైతే వాటిని మార్చేందుకు అనుసరించాల్సిన విధానం, మాక్‌పోల్ నిర్వహణ, ఎన్నికలు ముగిసిన తర్వాత అనుసరించాల్సిన విధానం, పీఓ డైరీ, అనుబంధ పత్రాలు పూర్తి చేయడం తదితర అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని స్పష్టం చేశారు. పీఓలు, ఏపీఓలు హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి అవగాహన పొందాలని సూచించారు. ఏపీఓలకు కూడా మండల స్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గత ఎన్నికల్లో మాదిరి ఈవీఎంలు అన్నీ ఒంగోలుకు కాకుండా ఎన్నికలు ముగిసిన గంటలోపు చేర్చేలా వైపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాలకు మధ్యంతర రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఒంగోలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జీవీ సుబ్బారెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి విశ్వేశ్వరరావు, ఓఎంసీ కమిషనర్ జస్వంతరావు, ఒంగోలు తహసీల్దార్ సుజన్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విధుల నుంచి రికార్డు అసిస్టెంట్ తొలగింపు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల రికార్డు అసిస్టెంట్ మండ్లా నరసింహులును విధుల నుంచి తొలగించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటున్న ఆయన ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి, టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి సమక్షంలో టీడీపీ కండువా వేసుకోవడంపై ఉన్నధికారులు విచారణ చేపట్టారు. విచారణ నివేదిక మేరకు నరసింహులును విధుల నుంచి తప్పించారు.

శ్రీశైలానికి పెరిగిన భక్తుల రద్దీ

- భారీగా తరలివెళ్తున్న భక్తజన సందోహం
- నేటి నుండి పదో తేదీ వరకు రాత్రి పూట ప్రయాణాలకు అనుమతి

పెద్దదోర్నాల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు భారీగా శ్రీశైలం తరలివెళ్తున్నారు. దీంతో రెండు రోజులుగా పెద్దదోర్నాల మండల కేంద్రంలో రద్దీ వాతావరణం ఏర్పడింది. శుక్రవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి 10వ తేదీ వరకు శ్రీశైలం ఘాట్ రోడ్డులో రాత్రి వేళ ప్రయాణానికి అటవీ శాఖ అనుమతిస్తున్నట్లు పెద్దదోర్నాల ఫారెస్ట్ రేంజ్ అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు. కర్ణాటక నుంచి తమ ఇంటి ఆడపడుచు భ్రమరాంబదేవి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించేందుకు కర్ణాటక వాసులు శ్రీశైలానికి భారీగా తరలివస్తున్నారు. వందలాది మంది భక్తులు శివుని చిత్రపటాలతో అలంకరించిన ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలానికి క్యూకట్టారు. కాలి నడకన నల్లమల అటవీ ప్రాంతంగుండా పుణ్య క్షేత్రానికి చేరుకుంటున్న వారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో దేవస్థాన కమిటీ తగిన ఏర్పాట్లు చేపట్టింది.



శ్రీశైలం వెళ్లేందుకు బారులుదీరిన వాహనాలు